క్లుప్తంగా

ఘనంగా ఇంజినీర్స్ డే



జీవీఎంసీ ఈఈ ప్రసన్నను సత్కరించిన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తారా ప్రసన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్యను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి వి.భార్గవి పాల్గొన్నారు.

వెంకన్నకు విశేషంగా అభిషేకాలు



వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు జరిగాయి. ఉదయం స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహించారు. పంచామృతాభిషేకాలతో అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు రామానుజమ్ పర్యవేక్షణలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువకుడి అదృశ్యం



మణికంఠ వర్మ (ఫైల్)

కూర్మన్నపాలెం: తమ కుమారుడు కనిపించడం లేదంటూ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేశారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన చుక్కన ఆదర్శ మణికంఠవర్మ పరవాడ ఫార్మా సిటీలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ నుంచి మణికంఠవర్మకు అతని తల్లి నందీశ్వరి ఫోన్ చేస్తున్నా ఎటువంటి సమాధానం లేకపోవడంతో ఆమె ఆందోళన చెందారు. వడిశలేరు గ్రామం నుంచి వచ్చి అగనంపూడి పరిసర ప్రాంతాల్లో వెతకగా ఎటువంటి సమాచారం లభించక పోవడంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సెయింట్ జోసెఫ్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్ రేపు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 17న నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు ఇంటర్ బైపీసీ పాసైన విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ టెస్ట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా కళాశాల ఫీజులో 100 శాతం రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 92473–62689 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉత్సాహంగా హర్ ఘర్ ధ్యాన్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో ఈకో రైల్వే వాల్తేర్ ఆధ్వర్యంలో శుక్రవారం హర్‌ఘర్ ధ్యాన్ క్యాంపెయిన్ జరిగింది. ఉద్యోగులు, అధికారులకు ధ్యానం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ భాగ్యశ్రీ.. శారీరక ఒత్తిడి రకాలు, ధ్యానం, ధ్యాస క్రియల ద్వారా వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. సీనియర్ అధికారి రంజన్ మొహంతి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు

- సింహగిరికి పోటెత్తిన భక్తులు
- ముగిసిన శ్రావణ మాస పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం గరుడసేవ ఘనంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



సింహవల్లీ తాయారు సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న వైదికులు



చతుర్భుజతాయారు, సువర్ణ అమ్మవారు



ఎస్‌ఆర్‌పురంలో కొలువుదీరిన దుర్గమ్మదేవి

విశేషంగా లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం 7 నుంచి 9 గంటల నుంచి అర్చకులు ఈపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులుగా సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు ఉత్సవమూర్తులను సింహాసనంపై అధిష్టంపజేశారు. పదిమంది అర్చకులు లక్ష నామాలను పఠిస్తూ పది ఆవృతులతో కుంకుమపూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు చక్రపాణి, పారాయణదారులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా తిరువీధి

శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సాయంత్రం సింహవల్లీ తాయారు సన్నిధిలో సహస్రనమార్చాన పూజ విశేషంగా నిర్వహించారు. 1001 నామాలు పఠిస్తూ భక్తుల గోత్రనామాలతో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టంపజేసి ఆలయ మాడ వీధిలో విశేషంగా తిరువీధి నిర్వహించారు.



సప్తగిరినగర్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తెలిపారు. 96వవార్డు పరిధిలోని నల్లక్వారీ, కామాక్షమ్మ కాలనీలో శుక్రవారం ఎమ్మెల్యే అదీప్ రాజ్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకం అందకపోతే అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నల్లక్వారీ శివాలయం అభివృద్ధికి రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతీ గడపలోనూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అవ్వా తాతలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ పింఛన్ కోసం తిరగకుండా వాళ్ల వద్దకే సొమ్ము వచ్చేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు దొగ్గ గౌతమ్, కిల్లి అప్పారావు, దాడి ఉమా మహేష్, కనీ వ్వనర్లు గణపతి,శివ, లెక్కల రమేష్, లెక్కల ప్రసాద్, మల్లగుప్తా ,జీవీఎంసీ అధికారులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

సింహాచలం: పాలిటెక్నిక్ చదువుతున్న సమయంలో నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా కెరీర్‌లో గొప్ప ప్రభావం చూపుతుందని అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్ ఇంజినీరింగ్ డైరెక్టర్ రవి మొదలవలస తెలిపారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన వాలిడెక్టరీ ఫంక్షన్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రవి మొదలవలస విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పాలిటెక్నిక్ చదువుతున్న సమయంలోనే నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నతస్థితికి చేరడానికి దోహదపడుతుందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఎల్ మూర్తి, కె.సత్తిబాబు, ఎం.నాగమణి, విభాగాధిపతులు పాల్గొన్నారు.



షీల్డ్‌లు అందజేస్తున్న రవి మొదలవలస, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

సింహాచలం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అడవివరం, పెందుర్తిలోని పలు ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. వరలక్ష్మీదేవిని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి ఆలయంలో కుంకుమపూజలు నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి కుంకుమపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో కుంకుమపూజ చేశారు.
- జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సప్తగిరినగర్ కాలనీ ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు లక్ష్మీ సహస్రనామార్చన, విష్ణు సహస్రనామార్చన నిర్వహించారు.
- సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- పెందుర్తి మండలం రాంపురంలోని రమా సహిత సత్యనారాయణస్వామి , సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు.

రేపు అన్న సమారాధాన

సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో ఆదివారం అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులంతా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగాదేవి

ముత్యాలమ్మపాలెం ఉప సర్పంచ్ నూకమ్మ మృతి



నూకమ్మ (ఫైల్)

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామ ఉప సర్పంచ్ సూరాడ నూకమ్మ (40) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందారు. ఐదు రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న నూకమ్మను చికిత్స నిమిత్తం నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. నూకమ్మకు ఇద్దరు సంతానం. భర్త పెంటయ్య ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నూకమ్మ అంత్యక్రియలు శనివారం నిర్వహించడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప సర్పంచ్ నూకమ్మ మృతికి సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్.అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

'బీమా పరిహారం చెల్లించాలి '

విశాఖ లీగల్ : వినియోగదారునికి బీమా అమల్లో ఉన్నందున వ్యక్తి మృతి చెందితే రావాల్సిన పరిహారాన్ని చెల్లించాలని వినియోగదారుల మండలి న్యాయమూర్తి జి. వెంకటేశ్వరి, సభ్యులు పి.విజయ దుర్గ,కె.రమణ బాబులు తీర్పునిచ్చారు. బీమా నిబంధనల ప్రకారం మృతుని కుటుంబానికి రూ.5 లక్షలతో పాటు రూ.లక్ష నష్టపరిహారం, రూ.10 వేలు ఖర్చులు ఇవ్వాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వినియోగదారుడు కర్రి రమణబాబు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండల పరిధిలోని బౌరాడ గ్రామ నివాసి. 2016 సెప్టెంబర్ 27వ తేదీన విశాఖలోని ఏవీఎన్ కళాశాల దగ్గర ఆంధ్ర బ్యాంకుకు వెళ్లారు. ఇండియా ఫస్ట్ ఇన్సూరెన్స్ కంపెనీకి సంబంధించి కొన్ని వాయిదాలు చెల్లించాడు. బీమా తీసుకొని కొన్ని నెలలకే అస్వస్థతతో మృతి చెందాడు. బీమా సౌకర్యం ఉన్నందున తమకు పూర్తి పరిహారం రూ.5 లక్షలు ఇవ్వాలని రమణ బాబు భార్య ఫోరంను ఆశ్రయించారు.

దీంతో విచారించిన న్యాయమూర్తులు ఫస్ట్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ముంబయ్, విశాఖపట్నం కార్యాలయం, ఆంధ్రా బ్యాంక్ సంయుక్తంగా పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. తమ తీర్పును మూడు నెలల్లో అమల పరచాలని వినియోగదారుల ఫోరం బీమా కంపెనీలను ఆదేశించింది. అయినా బీమా కంపెనీ పట్టించుకోలేదు. దీంతో ఫిర్యాదు తరఫున న్యాయవాది ఆడారి అప్పారావు శుక్రవారం అమలు పిటిషన్ దాఖలు చేశారు.

ముగిసిన క్రీడా పోటీలు



పోటాపోటీగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పరవాడ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు రెండు విభాగాల్లో, 9 క్రీడా అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజు క్రీడా పోటీలను లంకెలపాలెం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 14 పాఠశాలల విద్యార్థులు వారి క్రీడా ప్రతిభను ప్రదర్శించారన్నారు. విజేతలు డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రిక్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో నియోజకవర్గంలో ఆడనున్న జట్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. శుక్రవారం వాలీబాల్, కబడ్డీ అండర్–17, త్రోబాల్ అండర్–14తో పాటు యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పోటీలతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి..

సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం ప్రతిభా విద్యాలయం ఆవరణలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. అండర్–14,అండర్–17 విభాగాల్లో విద్యార్థిని, విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహన్ని ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ కాక్ తదితర పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, ప్రతిభా విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ఎంఈవోలు లక్ష్మణరావు,సత్యనారాయణ, సబ్బవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు, సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,ఎంపీటీసీ బైలపూడి దేముడు, గొర్లి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

విస్తృతంగా ధార్మిక కార్యక్రమాలు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటా ధర్మ ప్రచారాన్ని విజయవంతం చేయాలని పరవాడ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావాడలోని సీతారాముల ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ధర్మ ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ నెలలో ఏకాదశి రోజున నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా, పౌర్ణమి రోజున గ్రామం అంతా కలిసి సామూహిక హారతి కార్యక్రమం, వారం వారం భజన నిర్వహించాలని సూచించారు. మండలంలోని అన్ని దేవాలయాల కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 17న గ్రామ పంచాయతీల కేంద్రంగా చేతి వృత్తులు, భవన నిర్మాణ కార్మికులు కలిసి విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించాలని అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సహ కన్వీనర్ పైల శ్రీను మాట్లాడుతూ ధర్మ ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేయాలన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సనాతన ధర్మం గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మాతృమూర్తులు తోట రమణమ్మ, డి.లక్ష్మి, టి.కళావతి, ఎం.పుష్ప, సత్యవతి, టి.రాము, అచ్చిబాబు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన భక్తులు

రీ సర్వేతో భూ వివాదాలకు చెక్

పరవాడ: రాష్ట్ర చరిత్రలో వందేళ్ల తర్వాత తొలిసారిగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు వైఎస్సార్ జగనన్న భూహక్కు భూరక్ష పథకానికి సంబంధించిన పత్రాలను నాయకులతో కలిసి శ్రీనివాసరావు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధిచిన వివరాల్లో తప్పులు దొర్లితే 15 రోజుల్లోగా సంబంధిత అధికారులకు తెలియజే యాలన్నారు. రీ సర్వే జరిపి పాస్ పుస్తకం మంజూరు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, వీఆర్వో వెంకటేశ్వరరావు, సర్వేయర్ మణికంఠ పాల్గొన్నారు.



జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

8 వాహనాలపై కేసుల నమోదు

గోపాలపట్నం: అధిక లోడుతో వెళ్తున్న ఎనిమిది వాహనాలపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టినట్లు ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు జె.రామ్‌కుమార్, ఐ.వేణుగోపాలరావు, ఎం.బుచ్చిరాజు, కె.ప్రవీణ్ కుమార్, బి.బాలాజీరావు, మన్మోహన్, కె.శ్రీనివాస్, ఆర్.సుధీర్, బి.రాజారావు, గణేష్ రెడ్డి, హరిప్రసాద్, ఏఎంవీఐలు శిరీష, దేవి, లలిత, సృజన పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 9 వినతులు

దొండపర్తి: పోలీస్ సిబ్బంది సమస్య పరిష్కారానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో 9 మంది సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ప్రమోషన్లు, డిప్యుటేషన్, ఇంక్రిమెంట్లు, క్వార్టర్స్ రద్దు చేసి హెచ్‌ఆర్‌ఏ మంజూరుకు సంబంధించిన వినతులు వచ్చాయి. వాటిని వెంటనే వాటిని పరిష్కరించాలని సీపీఆదేశించారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్

తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు..	
జోన్-1 (సీతమ్మధార నుంచి హనుమంతవాక)	9440812488
జోన్-2 (కంచరపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్)	9440812489
జోన్-3 (మధురవాడ-భీమిలి-హనుమంతవాక)	9490606924

ఫైర్ అనుమతుల కోసం..	
ఆర్‌ఎఫ్‌వో	9989961135
డీఎఫ్‌వో	9912448555
ఎస్ఎఫ్‌వో	7989495108

దొండపర్తి : వినాయక చవితి సందర్భంగా నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ శాఖ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఏపీఈపీడీసీఎల్, రవాణా, ఏపీ ఫిషరీస్, మెరైన్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల్లో బారికేడింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, సీసీ కెమెరాలు, జనరేటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. అలాగే జీవీఎంసీ, ఫిషరీస్ ద్వారా తగినంత మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి వారికి సరపడా లైఫ్ జాకెట్లు అందించాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా పాయింట్ల వద్ద హైడ్రాలిక్ హై ఎండ్ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు,

కళాశాలల ద్వారా కరపత్రాలను పంపిణీ చేయాలని చెప్పారు. ఆస్పత్రి, పాఠశాలలు, మతపరమైన ప్రదేశాల్లో లౌడ్‌స్పీకర్లు వాడకంపై పరిమితులు ఉంటాయని, గణేష్ మండపాల వద్ద మ్యూజిక్ 10 డెసిబుల్స్‌కు మించి ఉండకూదని స్పష్టం చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో అగ్నిమాపక దళం/రెస్క్యూ మేనేజ్‌మెంట్ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముఖ్యమైన గణేష్ మండపాల వద్ద మొబైల్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను, బకెట్ ఇసుక, నీటిని అందుబాటులో ఉంచేందుకు నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాగర్‌నగర్, అప్పికొండ, ఇతర నిమజ్జన ప్రదేశాల్లో సంబంధిత ఎస్‌హెచ్‌వోలను సంప్రదించి ఆర్టీసీ బస్సుల మళ్లింపు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని, ఆ సర్టిఫికెట్ నిమజ్జనానికి వినియోగించే ప్రతి వాహనంలో ఉండాలన్నారు.

మండపాలకు అనుమతులు ..

మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం 4వ అంతస్తులో ఉండే రీజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక ఈపీడీసీఎల్ ఏఈ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఆ ఎన్‌వోసీతో సంబంధిత పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను సంప్రదిస్తే అనుమతి ఇవ్వనున్నారు.